క్లుప్తంగా

ప్రజలకు దసరా శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే శంబంగి


డాక్టర్ తలే రాజేష్

బొబ్బిలి/రాజాం: బొబ్బిలి,రాజావ నియోజక వర్గ ప్రజలకు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని విజయదుర్గ అమ్మవారిని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఆ అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు.

కోటలో ఆయుధ పూజ


సింహాసనం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: దసరా సందర్భంగా స్థానిక కోటలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. వివిధ ఆయు ధాలకు, పాత సింహాసనానికి మాజీ మంత్రి ఆర్.వి.ఎస్.కె.రంగారావు, ఆయన సోదరులు ఆర్.వి.ఆర్.కె. రంగారావు, ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు పూజలు చేశారు.

మెగా వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుడు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో శశాంకరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది.మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 400 మంది శిబిరానికి హాజరు కాగా వైద్యులు వీరికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసర మైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ వై.సురేష్‌కుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ రిషికుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ త్రివేణి శిబిరంలో సేవలందించారు. సుప్రీం కోర్టు న్యాయవాది యలకల రాజగోపాల రావు, సర్పంచ్ యలకల శ్రీనివాసరావు, వివిధ ఆస్పత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన చండీయాగం


యాగం చేస్తున్న పురోహితులు

సంతకవిటి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పొనుగుటువలస లోని శ్రీవిద్య, శ్రీమేధా దక్షిణామూర్తి పీఠంలో తొమ్మిది రోజులుగా నిర్వహించి న చండీయాగం బుధవారంతో ముగిసింది. బ్రహ్మశ్రీ రంప సుబ్బారావు శర్మ, రంప కోదండరామశర్మల ఆధ్వర్యంలో ఈ యాగం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. బుధవారం పూర్ణాహుతి చేపట్టారు. అనంతర మండల మండప ఉద్వాసన, అవభృత స్నానం చేశారు.అనంతరం అన్నదానం నిర్వహించారు.

నేడు మద్యం దుకాణాలు తెరవొద్దు

రాజాం: గురువారం విజయదశమి పండగతో పాటు గాంధీ జయంతి కూడా ఉన్నందున లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలను తెరవకూడదని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ రాజాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా పండగ అని లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలను తెరిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్లు అధ్వానం...ప్రయాణం నరకం

- పల్లె రోడ్లు ఛిద్రం
- అడుగుకో గుంత, గజానికో గొయ్యితో దర్శనమిస్తున్న రోడ్లు
- రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బొబ్బిలిరూరల్/తెర్లాం/వంగర/బాడంగి: బొబ్బిలి,రాజాం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా మారాయి. అడుగుకో గొయ్యి, గజానికో గుంతగా మారిన ఈరోడ్లపై ప్రయాణాలు నరకప్రాయంగా మారాయి. బొబ్బిలి మండలంలో బొబ్బిలి నుంచి అలజంగి, మెట్టవలస నుంచి బోజరాజపురం, పలు మైదాన ప్రాంత గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు సీహెచ్.బొడ్డవలస నుంచి గిరిజన గ్రామాలను అనుసంధానం చేసే రోడ్లు ఛిద్రమయ్యాయి. వర్షాలు కురుస్తుండడంతో రోడ్లపై గుంత ల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులు గుంతలను అంచనా వేయలేక వాటిలో వాహనాలను దింపి పల్టీలు కొట్టి గాయాల పాలవుతున్నారు. అలాగే నిత్యం రద్దీగా ఉండే తెర్లాం మండలంలోని ఉద్దవోలు నుంచి రాజాం మండలంలోని గడ్డిముడిదాం గ్రావెల్ రోడ్డు గోతులతో దమ్ము మడిలా మారింది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు వీలు లేని విధంగా ఈ మార్గం తయారైంది. వంగర మండల కేంద్రం నుంచి శివ్వాం, తలగాం, రుషింగి గ్రామాల మీదుగా రాజులగుమ్మడ వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న తారు రోడ్డు పూర్తిగా రోడ్డు ఆనవాళ్లే కోల్పోయింది. పూర్తిగా శిథిలమై గోతుతో ప్రమాదకరంగా మారింది. బాడంగి మండల కేంద్రం నుంచి రామభద్రపురం మండల కేంద్రాన్ని అనుసంధానించే ప్రధాన రహదారిలో ప్రయాణం చేసే వారి ఒళ్లు హూనమవుతోంది. రోడ్డులో ఎక్కడిక క్కడ గొయ్యిలు ఏర్పడ్డాయి. బాడంగి మండల కేంద్రంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.


బొబ్బిలిరూరల్: పూర్తిగా గోతులు తేలిన అలజంగి-కారాడ రోడ్డు


బొబ్బిలిరూరల్: చెరువులా దర్శనమిస్తున్న బొబ్బిలి నుంచి అలజంగి వెళ్లే రోడ్డు


బొబ్బిలిరూరల్: మెట్టవలస నుంచి బోజరాజపురం వెళ్లే రహదారి


బాడంగి: మండల కేంద్రం బాడంగిలో గోతుల తేలిన ప్రధాన రహదారి

సంక్రాంతి పోయి...దసరా వచ్చింది

సంక్రాంతి నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుంతలు లేని రోడ్లు చూస్తారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2024 నవంబర్ నెల ప్రారంభంలో హామీ ఇచ్చారు. గుంతల రోడ్ల వల్ల ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నాయని, రోడ్లన్నింటినీ అద్దంలా మెరిసేలా చేస్తామని చంద్రబాబుతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఊదరగొట్టారు.చంద్రబాబు హామీలు నీటి మీద రాతలగానే మిగిలాయి. గుంతలు మరింత పెద్దవిగా, ప్రమాదకరంగా మారాయి. కొన్ని చోట్ల రోడ్ల మరమ్మతులు ప్రారంభించి ఒకటి,రెండు కిలోమీటర్ల మేర తూతూ మంత్రంగా అక్కడక్కడా గోతులు కప్పి మమ అనిపించేశారు. సీఎం చంద్రబాబు చెప్పిన సంక్రాంతి పండగ పోయి దసరా వచ్చింది. మరో మూడు నెలల్లో మళ్లీ సంక్రాంతి వస్తున్నా రోడ్ల దుస్థితి మారలేదు.ఇప్పటికైనా రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


బొబ్బిలిరూరల్: దమ్ముమడిలా సీహెచ్ బొడ్డవలస నుంచి బట్టివలస తదితర పది గిరిజన గ్రామాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు


తెర్లాం: బురదమయమైన ఉద్దవోలు-గడ్డిముడిదాం రోడ్డు


వంగర: తలగాం- రుషింగి గ్రామాల మధ్య శిథిలమైన రోడ్డు

ఎమ్మెల్సీ పరామర్శ


గోవిందరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామ సర్పంచ్ కరణం గోవిందరావు ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈవిషయం తెలిసిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం ఉప్పర్నాయుడువలస వెళ్లి గోవిందరావును పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితి అడిగితెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహ నరావు, పార్టీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గార రమణ, ఎంపీటీసీలు పొగిరి అప్పలనాయుడు,ఎర్నేన అప్పలనాయుడు, సంకిలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెంబూరు గోపాలకృష్ణ, అక్కన్నఅగ్రహారం ఉపసర్పంచ్ బాలి తవిటినాయుడు, నాయకులు ముంజేటి కిశోర్ ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజాఉద్యమాలను ఆపలేరు


మాట్లాడుతున్న కోట అప్పన్న, తదితరులు

బొబ్బిలి: ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ,సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, పురం అప్పారావులను అరెస్టు చేయడం దారుణమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న తదితరులు అన్నారు. పట్టణంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన హామీల అమలుపై సీపీఐ నాయకులు ప్రశ్నిస్తారని ముందస్తుగా పలువురిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తిప్పడం అన్యాయమన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.1500 ఆర్థిక సహాయం అందిస్తామని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని, ఇలా అనేక హామీలు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు.గిరిజన పల్లెల రూపురేఖలు మార్చేస్తామని ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ 15 నెలల పాలనలో చేసిందేమిటని ప్రశ్నించారు. సీపీఐ పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాసరావు,నాయకులు వి.బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయండి


ఉపాధ్యాయుల డిమాండ్ల చిట్టా ప్రదర్శిస్తున్న జేసీ రాజు, తదితరులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు,తదితరులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యా యుల డిమాండ్లకు సంబంధించిన వివరాలను బుధవారం విడుదల చేశారు. ముఖ్యంగా పీఆర్‌సీకి కమిషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని,ఆర్థిక బకాయిలను చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని,ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, బోధనే తర పనుల ను రద్దు చేయాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఈ సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నేతలు సీహెచ్.జి. శర్మ, యుగంధర్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు


బొమ్మల కొలువు

బొబ్బిలి: పట్టణంలోని అగ్రహారం వీధిలో ఉన్న ఎవరెస్ట్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రిటైర్డు టీచర్ కామేశ్వరి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ బొమ్మల కొలువులో దేవతల బొమ్మలే కాకుండా స్వాతంత్ర్య సమరయోధుల బొమ్మలు కూడా విద్యార్థులు, స్థానికుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సందర్భంగా కామేశ్వరి మాట్లాడుతూ 50 ఏళ్లగా బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

ముగిసిన వైద్య శిబిరాలు

తెర్లాం: 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో మహిళల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలు బుధవారంతో ముగిశాయి. ఆఖరి రోజున తెర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎం.ఆర్ అగ్రహారం గ్రామ సచివాల యం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.శిబిరంలో మహిళలకు పీహెచ్‌సీ వైద్యాధి కారి స్వాతి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎం.ఆర్ అగ్రహారం, కుమ్మరిపేట, తమ్మయ్యవలస, రంగప్పవలస గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై ఐసీడీఎస్ బాడంగి పీఓ వరహాలమ్మ అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, సీహెచ్‌ఓ భాస్కరరావు, సర్పంచ్ లొట్టి లక్ష్మి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జయ జయహే... మహిషాసురమర్దిని


బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీఎమ్మెల్యే శంబంగి, భవానీ భక్తులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలు, దుర్గాదేవి మంటపాల్లో అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. బొబ్బిలి పట్టణంలోని ఫైల వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పూజలు చేశారు. పలుగ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


తెర్లాం: తెర్లాంలోని దుర్గాదేవి మంటపంలో దీపారాధన చేస్తున్న భవానీలు


బొబ్బిలి: గొల్లపల్లిలోని దాడితల్లి ఆలయంలో మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు


బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో మహిషాసుర మర్దిని అవతారంలో దుర్గాదేవి


రాజాం: రాజాంలోని గాయత్రీదేవి ఆలయంలో మహిషాసురమర్దినికి పూజలు


రాజాం సిటీ: రాజాం ట్యాక్సీ స్టాండ్ వద్ద మహిషాసుర మర్దినిగా పూజలందుకుంటున్న అమ్మవారు


రామభద్రపురం: రామభద్రపురంలోని సాయినగర్ దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు దంపతులు


బాడంగి: బాడంగిలోని ఉమాసోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


రాజాం సిటీ: కంచరాం ఎస్సీ కాలనీలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


రేగిడి: రేగిడిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భవానీ భక్తులు


బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న భక్తులు


వంగర: సంగాంలోని దుర్గాదేవి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న భవానీ భక్తులు

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు


రక్తదాతలను సత్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

రాజాం సిటీ: రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజాంలో పలువురు రక్తదాతలను రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ కష్టంలో ఉన్నవారికి సహాయాన్ని అందిస్తూ సమాజహితం కోసం కృషిచేయాలని అన్నారు. ఆరోగ్యవంతులైన యువకులు ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని చెప్పారు. అపోహలు వీడి గ్రామీణ ప్రాంత యువకులు రక్త దానానికి ముందుకు రావాలని కోరారు. పలుమార్లు రక్తదానం చేసిన మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ, సీహెచ్.కేశవ నారాయణ, కె.కోటి, వి.రమేష్‌ను అభినందించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె నాయుడు, మానవతా సంస్థ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు


తెర్లాం: రైతులకు అవగాహన కల్పిస్తూ తెర్లాంలో ట్రాక్టర్లతో ర్యాలీ చేస్తున్న అధికారులు

రామభద్రపురం: జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పరికరాల ధరలు తగ్గి రైతులకు పెట్టుబడి భారం తగ్గుతుందని వాణిజ్య పన్నుల అధికారి ఎస్.ఎం.వి.ఎస్.ఎస్. చంద్రమౌళి అన్నారు. మండలంలోని రామభద్ర పురం,తారాపురం రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఎం మధుసూదనరావుతో కలిసి 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవ్'పై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లు,స్ప్రేయర్లు,స్ప్రింకర్లు,స్పేర్ పార్ట్స్ వంటి వ్యవసాయ పరికరాలపై 18 శాతం వరకు జీఎస్టీ తగ్గుతుందన్నారు. రామభద్రపురం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, ఏఓ శివ పాల్గొన్నారు.

బొబ్బిలి మండలంలో..

బొబ్బిలిరూరల్: జీఎస్టీ తగ్గింపులు ద్వారా రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామసుందర రావు తెలిపారు.ఈ పక్కి,పిరిడి,అలజంగి గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తెర్లాంలో..

తెర్లాం: వ్యవసాయ యంత్రాలు, పరికరాలపై జీఎస్టీ తగ్గించడంపై 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవ్' పేరిట వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు రైతులతో కలిసి ట్రాక్టర్ల ర్యాలీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణ, ఏఓ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ నీలిమ, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాడంగి మండలంలో..

బాడంగి: జీఎస్టీపై మండలంలోని భీమవరం,డొంకినవలస, పాల్తేరు,కోడూరు, రేజేరు,ఆనవరం గ్రామాల్లో రైతులకు ఏఓ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల వ్యవసాయ పరికరాలు, పురుగు మందుల ధరలు తగ్గుతాయని చెప్పారు. ఆయా గ్రామాల వీపీఏలు పాల్గొన్నారు.